# నూతన వ్యవసాయ విధానం

-కె. బాలగోపాల్

మనకు పూర్తిగా తెలియకుండానే చాలా మార్పులు వచ్చేస్తున్నాయి. ఒక్కొక్క రంగంలోనూ కొత్త విధానాలను వేగంగా ప్రవేశ పెడుతున్నారు. ఈ కొత్త విధానాల సారాంశం ఒక్కటే వనరుల ఉత్పాదకతను వేగంగా పెంచడం ద్వారా ఆర్థిక వ్యవస్థ పెరుగుదల రేటును వేగంగా పెంచాలి. దీని ఫలితంగా సమాజంలో అసమానతలు తగ్గుతాయా? అందరికీ పనులు దొరుకుతాయా? దరిద్రరేఖకు దిగువనున్న వారు పెరిగి ఎగబ్రాకగలరా?

ఈ ప్రశ్నలు ఎక్కడా వేగం కాకపోవడం కొత్త విధానాల లక్షణాలలో ఒకటి. మన రాష్ట్ర ప్రభుత్వం మొన్నటి డిసెంబర్ 9న విడుదల చేసిన వ్యవసాయ విధాన పత్రం ఒక ఉదాహరణ.

వరిసాగులో దిగుమతులు తక్కువగా ఉన్నాయనేది ఈ విధాన పత్రం పేర్కొనే సమస్యలలో ఒకటి తమిళనాడు పంజాబు రాష్ట్రాలతో పోలిస్తే మనం దాదాపు 35 శాతం తక్కువ దిగుబడి తీస్తున్నాం. మన రైతులు హెక్టారుకు సగటున 2.58 టన్నులు పండించగా, తమిళనాడు రైతులు 3.34 టన్నులు, పంజాబు రైతులు 3.23 టన్నులు పండిస్తున్నారు.

ఈ తేడాను పోగొట్టగలిగితే మన రాష్ట్రంలో వరిసాగు ఆరాష్ట్రాల ప్రమాణాలను అందుకుంటుంది. అయితే ఈ తేడాకు గల కారణం ఏమిటి? అనే ప్రశ్నకూడ ప్రభుత్వ విధాన పత్రం. వేసుకొని జవాబు చెప్తుంది. పంజాబు, తమిళనాడు రాష్ట్రాలలో బావుల కింద వరిసాగు ఎక్కువ. మనదగ్గర కాలవల కింద ఎక్కువ. బావుల కింద ఉత్పాదకత ఎక్కువ ఉండడం వల్లనే, మొత్తం మీద ఆ రాష్ట్రాల రైతులు వరిసాగులో ఎక్కువ దిగుబడి తీయగలుగుతున్నారు.

దీని నుండి ప్రభుత్వం ఏగుణ పాఠం తీసుకుంటుంది? మన దగ్గర కూడ బావుల కింద వరిసాగును ప్రోత్సహించాలనా? మరైతే ప్రపంచ బ్యాంకు మాటలు విని వ్యవసాయ కరెంటు మోటర్ల నుండి వసూలు చేసే కరెంటు చార్జీలు పెంచడం మంచి ఆలోచన కాదుకదా? దాని వల్ల ఇప్పుడున్న మేరకు కూడ బావుల కింద వరిసాగు జరగకపోతే మనం వరిపొలాల ఉత్పాదకతలో తమిళనాడు, పంజాబు రాష్ట్రాల కంటె ఇంకా వెనకబడిపోతాముకదా?

కానీ ప్రభుత్వ విధాన పత్రం ఈ విషయం గురించి మాట్లాడదు. బావుల కింద వరిసాగు పెంచే అవకాశం కూడ కాలవలున్న ప్రాంతాలలోనే ఎక్కువ ఉంటుంది కాబట్టి (భూగర్భ జలాలు భూమి పై పొరల లోనే దొరుకుతాయి కాబట్టి) కాలువలున్న ప్రాంతాలలో బావుల కింద వరిసాగును ఇంకా ప్రోత్సహించే కార్యక్రమం పెట్టుకోవాలని విధాన పత్రం నిర్ణయించింది.

అంటే అర్థం, వరిదిగుబడులలో మనం వెనుకబడిన తనాన్ని అధిగమించడానికి, కృష్ణాగోదావరి డెల్టాలలో బావులకింద వరిసాగును మరింత ప్రోత్సహిస్తారు. బావులే ప్రధానమయిన తెలంగాణ, రాయలసీమలలో బావుల కింద వరిసాగును ప్రోత్సహించడానికేమీ చేయరు. కనీసం పెంచబోతున్న విద్యుత్ ఛార్జీలను తగ్గించే ప్రయత్నం కూడ చేయరు. దీని వల్ల వ్యవసాయరంగంలో ఇప్పటికే బలంగా నెలకొని ఉన్న ప్రాంతీయ అసమానతలు మరింత పెరుగుతాయనడంలో సందేహమక్కరలేదు.

తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రత్యక్ష ఫలితం ఎక్కడ వస్తుందో అక్కడే ప్రభుత్వ విధానాల దృష్టి నిలపాలన్న సాధారణ సూత్రానికిది ఫలితం. ఇది అన్నిరకాల అసమానతలను పెంచుతుంది. ప్రాంతీయ అసమానతలు కూడ పెంచుతుంది.

మొత్తంగా వ్యవసాయ విధానంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న మార్పులను ఈ విధాన పత్రం స్పష్టంగానే పేర్కొంటుంది. ఇప్పటి దాకా అమలులో ఉన్న విధానం ఈ కింది నాలుగు సూత్రాల ప్రాతిపదికన నడిచింది.

(1) వ్యవసాయ కూలీలకు భూములు పంచడం సమతకు దారి తీస్తుంది.

(2) తన స్వంత కమతంలో స్వంతగా సాగుచేసుకునే రైతే ఎక్కువ ఉత్పత్తి చేస్తాడు

(3) కనీసమద్దతు ధరలు, సబ్సిడీలు వ్యవసాయం ఉత్పత్తికి అవసరమయిన ప్రోత్సాహకంగా పనిచేస్తాయి.

(4) ఇక్కడ అమ్మగా మిగిలిపోయినది. మాత్రమే ఎగుమతి చేయాలి.

ఈ సూత్రాలు (ముఖ్యంగా మొదటిది, మూడవది) నిజంగా అమలయినా కాకున్నా వ్యవసాయ విధానాలకు ఇవే తగిన వన్న అభిప్రాయం ఉన్న మాట సత్యమే. దేశీయ వినిమయానికి ప్రాధాన్యత, చిన్న రైతులకు కేంద్రస్థానం, భూమిలేని వారికి భూముల పంపిణీ, రైతులను రాయితీల ద్వారా ఆదుకోవడంలోను ప్రభుత్వం బాధ్యత అనే నాలుగు అంశాలు సంక్షేమ విధానాన్ని నిర్వచిస్తాయనడంలో సందేహమక్కరలేదు.

ఇందులో ఉన్న తప్పేమిటో చంద్రబాబు విధాన పత్రం చెప్పదు. చెప్పకుండ, పెద్ద రైతులనూ పెట్టుబడినీ విదేశీ ఎగుమతులను వ్యవసాయ వ్యాపారీకరణను కేంద్రంగా గల కొత్త అయిదు సూత్రాలను ప్రతిపాదిస్తుంది.

(1) వ్యవసాయ ఉత్పత్తికి, నిజమైన ప్రోత్సాహకాలు పెట్టుబడి మీద అధిక లాభం పొందడం, ఉత్పత్తుల అమ్మకానికి సమర్థమైన మార్కెటింగ్ వ్యవస్థ ఉండడం.

(2) మార్కెట్ అవసరాలను బట్టి ఉత్పత్తి ఉండాలి.

(3) వ్యవసాయం, వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకం, వ్యవసాయాధార పరిశ్రమలు ఒక దానితో ఒకటి సన్నిహితంగా ముడిపడిన వ్యవహారాలుగా సాగాలి.

(4) మార్కెట్ అవసరాలను తెలుసుకోవడానికి, న్యాయబద్ధమైన పోటీకి అవసరమైన సమాచార వ్యవస్థ ఉండాలి.

(5) ఎగుమతిని లక్ష్యంగా గల వ్యవసాయ ఉత్పత్తి జరగాలంటే పెద్ద ఎత్తున పెట్టుబడులు కావాలి. దానికి వ్యవసాయ నిర్వహణ తగిన మోతాదులో వ్యవస్థితంగా సాగాలి. ఇప్పుడున్నట్టు చిన్న చిన్న ముక్కలుగా చీలిపోయిన కమతాలు సరయినవికావు.

చిన్న కమతాలే మంచివి కావంటే ఇంక భూసంస్కరణల గురించి మాట్లాడుకోవడం అనవసరం. వ్యవసాయకూలీలకు భూములు పంచటాన్ని గురించి మాట్లాడుకోవడం అనవసరం. సీలింగ్ చట్టాలను రద్దుచేయడంద్వారా గానీ, వేరే ఇతర రూపంలో గానీ పెద్ద పెద్ద వ్యవసాయ క్షేత్రాలను తిరిగి ఉనికిలోకి తీసు కొస్తారు. అయితే ఇవి దొరల, దేశ్‌ముఖ్‌ల క్షేత్రాలు కావు. ట్రాక్టర్లు, కొత్త మిషన్లు, స్ప్రింక్లర్లు పెట్టుకొని భారీగా పెట్టుబడి పెట్టి, ఎగుమతి కోసమో లేక వ్యవసాయాధారిత పరిశ్రమల కోసమో ఉత్పత్తి చేసే పెట్టుబడిదారీ వ్యవసాయ క్షేత్రాలు.

ఈ వ్యవహారంలో చిన్న రైతులు ఏ మవుతారు? కార్పొరేట్ వ్యవసాయక్షేత్రాల మధ్య చిన్న మోతాదులో వ్యవసాయం చేసుకుంటూ బతకడం కష్టం. నీటి పారుదల వసతికైనా భరోసా ఉంటే ఆ బతుకు సాధ్యమయ్యేదేమోగానీ చంద్రబాబు నూతన వ్యవసాయ విధానంలో సాగునీటి ప్రస్తావన ఎక్కడా లేదు. రైతులే బోర్లు వేసుకొని పూర్తి కరెంటు చార్జి కట్టి సాగునీరు పొందవలసి ఉంటుందేమో అది అందరికీ సాధ్యం కాదు. కాబట్టి కార్పొరేట్ వ్యవసాయ కంపెనీలకు తమ భూములు అమ్మి, లేక లీజుకిచ్చి, కూలి చేసుకొని బతికే స్థితికి నెట్టబడతారు.

లేకపోతే తమ కమతాలలో చేసే ఉత్పత్తిని ఏదో ఒక వ్యవసాయాధారిత పరిశ్రమకు లేక వ్యాపారానికి ముడిపెట్టి చేయాలి. బావితవ్వకం కోసమైనా ఇంకదేనికోసమయినా వారి దగ్గరే అప్పులు తీసుకోవాలి. గిట్టుబాటుధర' వారి నుండే కోరుకోవాలి. రైతుకు గిట్టుబాటుధర దక్కాలంటే ప్రభుత్వ సంస్థలు వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేయడం సరయిన మార్గంకాదనీ వ్యవసాయుత్పత్తులను పరిశ్రమలతో లేక ఎగుమతి చేసే కంపెనీలతో ముడిపెట్టడం సరైన మార్గమనీ చంద్రబాబు వ్యవసాయ విధానపత్రం అంటుంది.

ఇది రైతులను చాల అస్థిరతలో పడేస్తుంది. రైతులు పెట్టుబడిదార్లకు తను ఉత్పత్తులు అమ్ముకోవడానికి ఇష్టపడరని కానీ, ఇష్టపడకూడదనికానీ నా ఉద్దేశ్యం కాదు. రైతులెప్పుడూ తమకుటుంబ అవసరాల కోసం మాత్రమే పండించుకొని బతకాలని అంతకంటే కాదు. కానీ ఎటుపోయి ఎటొచ్చినా తన బతుకు వెళ్ళదీసుకోవడానికి కావలసిన ఉత్పత్తి చేసుకునే స్థితిలో ఉండి ఆపైన పరిస్థితులు అనుకూలించినప్పుడు పంటను ఏ పెట్టుబడిదారుకో అమ్ముకునే టట్టయితే ఫరవాలేదు. ఆవిధంగా కొద్దికొద్దిగా బాగుపడి పైకి పోయిన రైతులు ఉన్నారు. అయితే పెట్టుబడి రుణాల దగ్గరినుండి ఉత్పత్తైన సరుకు అమ్మకందాకా అన్నిటికీ ఒక కార్పొరేట్ సంస్థనే నమ్ముకోవడం రైతాంగాన్ని అస్థిరత్వంలో ముంచేస్తుంది.

అందుకే రైతాంగ ఉద్యమాలెప్పుడూ సాగునీటికి ప్రాముఖ్యం ఇచ్చాయి. సాగునీరున్నట్టయితే రైతు జీవితానికి కొంతయినా స్థిరత్వం ఉంటుంది. ఎవ్వరిమీదా ఆధారపడకుండ బతకదలుచు కుంటే బతకొచ్చు. ఇంకా ఎక్కువ సంపాదించు కోవాలనుకుంటే వ్యాపారపంటల మార్కెట్‌లోకి ప్రవేశించ వచ్చు కానీ మౌలికమైన స్థిరత్వానికి కావలసిన సాగునీరుగానీ వేరే ఏవసతిగానీ రైతాంగానికి అందియ్యకుండ నేరుగా కార్పొరేట్ సంబంధాలలోకి రైతులను నెడితే అతి దుర్భరమైన అస్థిరతకు దారితీయగలదు. 'పత్తిరైతుల ఆత్మహత్యల' వంటి ఘటనలు ఇంకా పెద్దఎత్తున జరగగలవు.

చంద్రబాబు వ్యవసాయ విధానాలు అన్ని ప్రాంతాలలోనూ చిన్న రైతాంగానికీ భూమి లేని పేదలకు నష్టకరమేగానీ అసలే వర్షాధార వ్యవసాయంమీద ఎక్కువగా ఆధారపడే తెలంగాణ, రాయలసీమ రైతులకు మరీ హానికరం.

★